క్లుప్తంగా

హరిహరక్షేత్రంలో కుంకుమార్చన



పూజల్లో పాల్గొన్న భక్తులు

నిర్మల్: ఆషాఢమాస అమావాస్య సందర్భంగా ఆదివారం జిల్లాకేంద్రంలోని మల్లన్నగుట్ట హరిహరక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని లలితాపరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు చేశారు. అనంతరం సుహాసినులు మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో ఆలయ ధర్మకర్త అల్లోల వినోద, ఆలయ గురుస్వామి మూర్తి, కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కుంటాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శి రాజబాపు పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆదివారం కుంటాల నుంచి కల్లూరు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఎఫ్ఏ రాజేశ్వర్, శివ ఉన్నారు.

మేరు కులసంఘ కార్యవర్గం



నూతన కార్యవర్గం

కడెం: మండలంలోని ఎలగడపలో గ్రామ మేరు కుల సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం గ్రామ అధ్యక్షుడిగా దీకొండ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రాపర్తి గంగ నర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో కుల సంఘ సభ్యులు ఉన్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం పూజలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ చేశారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

లోకేశ్వరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షిస్తూ.. మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు డప్పుచప్పుళ్ల నడుమ మోదీ, మందకృష్ణ చిత్రపటాలను వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్, భోజన్న, లక్ష్మణ్, గణేశ్, రాజు, శ్యాం, వినోద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏబీపీడీపీఎస్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సమితి సభ్యులు

నిర్మల్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి(ఏబీఏడీపీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న నాగమ్మ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. సమితి జాతీయ అధ్యక్షుడు రాజు దేశ్‌పాండే సూచనల మేరకు ప్రతీ అమావాస్య రోజున అన్నప్రసాదం చేస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి నిర్మల్ అధ్యక్షుడు కోటగిరి గోపి, ప్రధాన కార్యదర్శి నాంపల్లి హరివర్మ, కోశాధికారి కందుల శేఖర్, ప్రచార కార్యదర్శి మంచిర్యాల శ్రావణ్ కుమార్, సభ్యులు బెజ్జంకి బ్రహ్మేందర్, రాకేశ్, బద్రి శేఖర్, గణేశ్ పాల్గొన్నారు.

రైతుబీమా దరఖాస్తుకు నేడు తుది గడువు

సోన్: రైతుబీమా నమోదుకు ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో అంబాజీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 28 లోపు పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతువేదికలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శిథిలావస్థకు కార్యాలయాలు

- భయంభయంగా సిబ్బంది విధులు
- కొత్త భవనాలు నిర్మించాలని వేడుకోలు



కూలిపోయిన మండల విద్యావనరుల కేంద్ర భవనం

కుభీర్: మండలకేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. చిన్నపాటి వర్షానికే గదులు ఊరుస్తున్నాయి. దీంతో అందులో విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని వేడుకుంటున్నారు.

- కుభీర్‌లోని మండల విద్యా వనరుల కేంద్ర (ఎమ్మార్సీ) భవనం పదేళ్ల కిందట కూలిపోయింది. దీంతో ఆ కేంద్రాన్ని మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవనంలోకి తరలించి ఓ గది కేటాయించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పాఠ పుస్తకాలు, విద్యార్థుల ఏకరూప దుస్తులు, ఇతర సామాను ఉంచేందుకు అక్కడ స్థలం లేక కస్తూరిబా భవనానికి తరలిస్తున్నారు. కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయులు కూర్చొనేందుకు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది మొత్తుకుంటున్నా.. నూతన భవనం నిర్మించడం లేదు.
- మండల కేంద్రంలోని పశువైద్యశాల భవనం శిథి లావస్థకు చేరినా ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్కడే ఆసుపత్రి కొనసాగుతుంది. స్లాబ్‌పై గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి చిన్నపాటి వర్షానికి ఊరుస్తోంది. నూతన భవనం నిర్మించాలని ప్రతి మండల స ర్వసభ్య సమావేశంలో తీర్మాణం చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినప్పటికీ లాభం లేదు. దీంతో సిబ్బంది భిక్కు భిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.
- కుభీర్‌లో ఉన్న ఎస్సీ హాస్టల్ భవనం గోడలు బీటలు వారి శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే గదులు ఉరుస్తున్నాయి. ప్రస్తుతం ఈ హాస్టల్‌లో 47మంది విద్యార్థులు ఉంటున్నారు.
- పాంగ్రలో పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.
- రాజురా ప్రాథమిక పాఠశాల భవనం దెబ్బతినడంతో విద్యార్థులకు వరండాలో చదువు చెబుతున్నారు.



శిథిలావస్థలో పశువైద్యశాల



శిథిలావస్థకు చేరిన ఎస్సీ హాస్టల్ భవనం

- కుభీర్ ప్రభుత్వ ఆసుపత్రికి ఉన్న ప్రహరీ కూలిపోయింది. కుభీర్‌లోని రెండో అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ కూలిపోయింది. ఇక్కడ కోతులు, వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. దీంతో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు.

భవనాలు నిర్మించాలి



ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో సిబ్బందితోపాటు అక్కడకు వచ్చేవారు భయపడుతున్నారు. పాతభవనాలు కూల్చివేసి అన్ని వసతులతో కొత్తవి నిర్మించాలి.

– బోడిగాం గంగాశేఖర్, కుభీర్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఇటీవల బదిలీపై మండలానికి వచ్చాను. మండలంలో కొన్ని ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. నూతన భవనాలు నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తాం.

– మోహన్‌సింగ్, ఎంపీడీవో, కుభీర్

గంగపుత్రులు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న మల్లేశ్

మామడ: గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని సుప్రీంకోర్టు అడ్వకేట్ మల్లేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని పొన్కల్ గ్రామంలో గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్య, ఉద్యోగ, సామాజిక, న్యాయ అవగాహన సమావేశం నిర్వహించారు. గంగపుత్రులు తమ పిల్లలను ఉపాధి కోసం దుబాయ్ పంపకుండా ఉన్నత చదువులు చదివించాలని పేర్కొన్నారు. గంగపుత్రుల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ అరవింద్, రమేశ్, ప్రవీణ్, భాస్కర్, రవివర్మ, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టి రాజు, మనోజ్, గ్రామ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, రవి, లక్ష్మి, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

‘చలో కలెక్టరేట్’ విజయవంతం చేయండి

లక్ష్మణచాంద: ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ సోమవారం ఉదయం 10 గంటలకు మాలమహానాడు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు అంబేద్కర్ సంఘం ఉమ్మడి కార్యాచరణ సమితి నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొండ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాల సోదరులు వచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

‘అడెల్లి’లో సీఐ పూజలు

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని ఆదివారం నిర్మల్‌రూరల్ సీఐ రామకృష్ణ దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి బాలాలయంలో పూజల అనంతరం ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ తీర్థ ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు సీఐని సత్కరించారు. వారి వెంట ఎస్సై శ్రీకాంత్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

నిర్మల్: నిర్మల్‌రూరల్ సీఐగా నియమితులైన రామకృష్ణను ఆదివారం పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, వ్యాపారవేత్త ఆమెడ కిషన్, రాజేశ్, వెంకటేశ్ తదితరులు కలిశారు.

‘సీఎం వ్యాఖ్యలు బాధాకరం’



మాట్లాడుతున్న ప్రైవేటు ఉపాధ్యాయులు

నిర్మల్: ప్రైవేటు ఉపాధ్యాయులపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరు బాధాకరమని.. వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని నిర్మల్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ తప్పినవారు, అర్హత లేని వారు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను బోధిస్తున్నారంటూ సీఎం మాట్లాడటం బాధాకరమన్నారు. అర్హతలు ఉండి ప్రభుత్వాల తీరుతో సకాలంలో నోటిఫికేషన్లు రాకనే ప్రైవేటు ఉపాధ్యాయులుగా పని చేయాల్సి వస్తోందని వాపోయారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు చాలీచాలని జీతాలు ఉన్నా.. జ్ఞానం తక్కువేం లేదన్న విషయం మర్చిపోవద్దని పేర్కొన్నారు. సీఎం తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హరీశ్, రాంప్రసాద్, పండరినాథ్, శ్రీనివాస్, విజయ్, శివ పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఖానాపూర్: వేడుకలో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘంతోపాటు వాసవి వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీమాత ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్నేహం విలువ, గొప్పతనం వివరించారు. పద్మజ, శ్రీలత, స్వరూప, పద్మ, సుజాత, భార్గవి, మానస, స్రవంతి, వర తదితరులున్నారు.



లక్ష్మణచాంద: వద్యాల్‌లో..

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో మిత్రులు పోతుగంటి నరేశ్‌కుమార్, రమేశ్‌కుమార్, దంత వైద్యులు వెంకటరమణ పాల్గొన్నారు.

బురద ఇలా.. వెళ్లేదెలా?



మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు దుస్థితి

కుంటాల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పీఏసీఎస్, ఐకేపీ, ఈజీఎస్, రైతువేదికతోపాటు ఎంపీడీవో కార్యాలయాల భవనాలు ఉన్నాయి. చిన్నపాటి వర్షాలకే ఈ కార్యాలయాలకు వెళ్లే దారులు బురదమయంగా మారుతున్నాయి. దీంతో ఇక్కడకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పీఏసీఎస్ కార్యాలయం నుంచి ఎరువులు తీసుకెళ్లే వాహనాలు మొరాయిస్తున్నాయి. అధికారులు స్పందించి కార్యాలయాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. మొక్కలు తొలగించరూ..



కడెం: మండలంలోని పాండ్వపూర్ సమీపంలో కడెం నదిపై ఉన్న వంతెనకు ఇరువైపులా మొక్కలు, చెట్లు పెరిగి.. ప్రమాదకరంగా మారినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. వంతెనపై ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మల్లారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ, ఫోన్ 94906 51358

ప్రకృతి ఒడిలో పరమశివుడు

- భక్తుల పూజలందుకుంటున్న కదిలి పాపహరేశ్వరుడు
- ఆలయంలో నేటి నుంచి శ్రావణమాస పూజలు



ఆలయంలో నందీశ్వరుడు



శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం

దిలావర్‌పూర్: జిల్లాలోనే అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం కలిగిన కదిలి శ్రీమాతాన్నపూర్ణేశ్వరి కదిలి పాపహరేశ్వరాలయంలో సోమవారం నుంచి శ్రావణమాస పూజలు ప్రారంభం కానున్నాయి. ప్రకృతి ఒడిలో ఆలయం ఉండటంతో స్వామివారిని దర్శించుకునేందుకు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలిరానున్నారు. ఆలయంలో నెలరోజులపాటు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. పారే సెలయేరు కొండల నడుమ ప్రాచీన శిల్పకళ దర్పణంగా నిలిచిన విగ్రహాలు, పశ్చిమదిశ ముఖద్వార ఆలయం భక్తులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

ఆలయ ప్రాశస్త్యం...

మాతృహత్య పాతకం నుంచి విముక్తి కోరుతూ పరశురాముడు దేశంలోని అనేక పుణ్యప్రదేశాల్లో 32 మహాశివలింగాలను ప్రతిష్ఠిస్తానని శివుడిని ప్రార్థించాడు. 32వ శివలింగాన్ని దిలావర్‌పూర్ మండలం కదిలిలో ప్రతిష్ఠించగా పరుశురాముడి భక్తికి మెచ్చి శివుడు ఈ లింగంలో దర్శనమిచ్చాడని ప్రతీతి. అప్పటి నుంచి ఈ ప్రదేశాన్ని కదిలే లొద్దిగా అభివర్ణిస్తున్నారు. సాధారణంగా ఆలయాలు తూర్పు, ఉత్తర, ముఖద్వారాలు కలిగి ఉంటాయి. ఈ ఆలయం మాత్రం పశ్చిమ ముఖద్వారం కలిగి ఉంటుంది. పశ్చిమ దిశకు అధిపతి అయిన శనీశ్వరుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులను పీడించవద్దని ఆదేశించేందుకు పరమశివుడు ఇక్కడ ఇలా ఆలయాన్ని ఏర్పరచాడని పురాణాలు చెబుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఒకే కాండంలో 18 వృక్షాలు మిళితమైన వటవృక్షం అత్తకోడళ్ల గుండాలు, సీతమ్మ అల్లుబండ, అన్నపూర్ణమాత, ఆలయ ద్వారపాలకులు సప్తరుషుల ధ్యాన మందిరం, నందీశ్వరుడు, ఆవునోటి ద్వారా కోనేరులో చేరే నీరు వంటి అంశాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే బోళలు, కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన అనేక విగ్రహాలు వారి కళానైపుణ్యానికి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి.

ప్రత్యేక ఏర్పాట్లు..

శ్రావణమాసం సందర్భంగా నెలరోజులపాటు నిర్వహించే ప్రత్యేక పూజల కోసం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏరాట్లు చేసినట్లు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్ తెలిపారు.

నిర్మల్‌కు 18కిలోమీటర్ల దూరంలో..

నిర్మల్ పట్టణం నుంచి భైంసాకు వెళ్లే రోడ్డుపై 12కిలోమీటర్లు ప్రయాణిస్తే దిలావర్‌పూర్ గ్రామ బస్టాండ్ వస్తుంది. అక్కడి నుంచి కుడివైపున ఉన్న ఆలయ స్వాగత తోరణం నుంచి మాడేగాం, కదిలి గ్రామాల మీదుగా మరో 6 కిలోమీటర్లు ప్రయాణిస్తే ఈ ఆలయానికి చేరుకోవచ్చు. ఏటా ప్రముఖులు వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



శ్రావణమాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరానున్న నేపథ్యంలో నిత్యాన్నదానం కొనసాగుతూనే ఉంటుంది.

– నార్వాడి వెంకట్రావు, ఆలయ కమిటీ చైర్మన్

పరమశివుని దర్శనం సర్వపాపహరణం



ఆలయానికి వచ్చిన భక్తులకు సర్వపాపాలు హరించబడుతాయి. కోరికలు తీరుస్తూ అశేష భక్తజనం చేతుల మీదుగా పాపహరేశ్వరుడు పూజలు అందుకుంటున్నాడు. శ్రావణమాసంలో నియమ నిష్టలతో స్వామివారిని కొలిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

– పంచాక్షరి, ప్రధాన అర్చకుడు

స్థల పరిశీలన



అధికారితో కలిసి స్థలం పరిశీలిస్తున్న చైర్మన్

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణానికి అమృత్–2 పథకం కింద రూ.22.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సదరు నిధులతో తాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణం చేపట్టేందుకు స్థలాలను ఆదివారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం పరిశీలించారు. ఈసందర్భంగా పథకం ఇన్‌చార్జి అధికారి దేవేందర్‌రెడ్డితో కలిసి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతంలో స్థలం పరిశీలించారు. త్వరలో పనులు చేపట్టి ప్రజలకు తాగునీరు అందేలా చూస్తామని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్‌పాషా, పరిమి సురేశ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న గ్రామస్తులు, సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన సలీం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం గ్రామస్తులు, అతడి చిన్ననాటి మిత్రులు జమ చేసిన రూ.30 వేల నగదును సలీం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గంజాల గంగాధర్, జేబన్న, మిత్రులు ఇంద్రకరణ్‌గౌడ్, సాగర్‌గౌడ్, గంగా ప్రసాద్, యోగేశ్, నర్సింలు, లింగన్న, జీవన్‌గౌడ్, రమేశ్, శ్రీకాంత్, నవీన్, శంకర్, సాయన్న, శ్రీనివాస్, ఆనంద్, భూమేశ్ పాల్గొన్నారు.